నేడు విద్యుత్ అధికారుల సమావేశం

శాలిబండ: సౌత్ సర్కిల్ విద్యుత్ అధికారులతో ఈ నెల 17న ఉదయం దారుషిఫా సాలార్‌జంగ్ రోడ్డులోని మినార్ గార్డెన్‌లో సీఎండీతో సమావేశం నిర్వహించనున్నట్లు విద్యుత్ అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో ఏడీఈలు, ఏఈలు, సబ్ ఇంజనీర్లు, ఎస్‌ఏఓలు, ఏఓలు, ఏఏఓలు, పీఓలు తదితరులు పాల్గొంటారన్నారు.

తలసేమియా సహకార కేంద్రంగా కమల హాస్పిటల్

అబిడ్స్: నగరంలో తలసేమియా, సికిల్ సెల్ సొసైటీ కింద పనిచేస్తున్న కమల హాస్పిటల్ అండ్ రిసోర్స్ సెంటర్ తలసేమియా ఇంటర్నేషనల్ ఫెడరేషన్ సహకార కేంద్రాల్లో ఒకటిగా ఎంపికైంది. ఈ విషయాన్ని బుధవారం టీఐఎఫ్ ప్రతినిధులు వెల్లడించారు. టీఐఎఫ్ సహకార కేంద్రాల నెట్‌వర్క్ తలసేమియా, సికిల్ సెల్ వ్యాధిపై పోరాడుతున్న దేశాల్లో సంరక్షణ, విద్య మానవ వనరులతో నిరంతర సహకారం అందిస్తుందన్నారు.

ఎమ్మెల్సీ శ్రవణ్‌కుమార్‌కు అభినందనలు



ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కె.శేఖర్‌రెడ్డి

గోల్కొండ: పార్టీ కోసం పని చేసిన వారికి ప్రాధాన్యం ఉంటుందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌కుమార్ అన్నారు. ఎమ్మెల్సీగా ఎన్నికైన సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు కె.శేఖర్‌రెడ్డి ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు.

మహిళలు స్వయం శక్తితో ఎదగాలి



మాట్లాడుతున్న మహ్మద్ నజీబ్

గోల్కొండ: స్వయం ఉపాధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను మహిళలు, యువతులు సద్వినియోగం చేసుకోవాలని పీస్ ఫోర్స్ సొసైటీ గ్రేటర్ అధ్యక్షులు మహ్మద్ నజీబ్ అన్నారు. బుధవారం టోలిచౌకీలోని తన కార్యాలయంలో ఆయన మహిళల స్వయం ఉపాధి పథకాలపై జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. బల్దియా ఆధ్వర్యంలో మహిళలకు ప్రత్యేకంగా పొదుపు సంఘాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటుందన్నారు. ఇందులో భాగంగా బల్దియా యూసీడీ విభాగం మహిళలకు చైతన్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నారన్నారు. ఇందుకుగాను మహిళలు పొదుపు సంఘాలుగా ఏర్పడి బ్యాంకుల్లో ఖాతాలు తెరుచుకోవాలని సూచించారు. కార్యాక్రమంలో ఉమ్మడి రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు ఆయుషా బేగం, జీనత్, ఫర్వయ తదితరులున్నారు.

నేరాల నియంత్రణపై పోలీసుల ఫోకస్



మైలార్‌దేవ్‌పల్లి: నిషేధిత గుట్కాలు, గంజాయి విక్రయాలపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నామని వీటిని ఎవరైనా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ మసూద్ అలీ, ఎస్‌ఐ పైడినాయుడు హెచ్చరించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని మధుబన్ కాలనీలో బుధవారం సాయంత్రం వాహనాల తనిఖీలతో పాటు కిరాణా దుకాణాల్లో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నేరాల నియంత్రణకు ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నామన్నారు. నెంబర్ ప్లేట్లు, సరైన దస్తావేజులు లేని వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. నేరాలను నియంత్రించడానికి ఎప్పటికప్పుడు నాకాబందీ, కార్డన్ సర్చ్‌లను నిర్వహిస్తున్నామన్నారు. చాలా ప్రాంతాల్లో నిషేధిత గుట్కాలు, గంజాయి అమ్మకాలు జరుగుతున్నట్లు తమకు పక్కా సమాచారం అందుతున్నదన్నారు. వీటి అమ్మకాలను తాము ఉపేక్షించమని వెల్లడించారు. అర్ధరాత్రి దాటిన కొంత మంది రోడ్లపై తిరుగుతూ ప్రజలకు ఇబ్బందులు సృష్టిస్తున్నారన్నారు. పోలీస్ పెట్రోలింగ్ నిర్వహిస్తూ ఆకతాయిల ఆటకట్టిస్తున్నామన్నారు. ఇప్పటికే పలుమార్లు కౌన్సిలింగ్ ఇచ్చామని తెలిపారు. అయినా కొంత మంది మారకుండా అలాగే వ్యవహరిస్తున్నారని ఈసారి పట్టుబడితే కఠిన చర్యలు తప్పవన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ యువత తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలన్నారు. డ్రగ్స్, గంజాయి జోలికిపోతే వారి జీవితాలు నాశనం అవుతాయని వారు స్పష్టం చేశారు.

బడాబాబుల గుప్పిట్లో

ఫుట్‌పాత్‌లు..

ఇష్టారాజ్యంగా తవ్వేస్తున్న బిల్డర్లు



సెవెన్ టూంబ్స్ చౌరస్తా రోడ్డు పక్కన ఫుట్‌పాత్‌ను తవ్వేసిన దృశ్యం

- పాదచారులకు రోడ్లే ఫుట్‌పాత్‌లుగా మారిన వైనం
- పట్టించుకోని బల్దియా, ట్రాఫిక్ పోలీసులు

గోల్కొండ: లక్షలాది రూపాయల ప్రజాధనాన్ని వెచ్చించి నిర్మించిన ఫుట్‌పాత్‌లు పాదచారులకు ఉపయోగంలో లేకుండాపోతున్నాయి. పలుప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లపై తోపుడు బండ్ల వ్యాపారులు కబ్జాలు చేయగా మరికొన్ని ప్రాంతాల్లో బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తున్న బిల్డర్లు ఫుట్‌పాత్‌లను పూర్తిగా తవ్వేస్తున్నారు. షేక్‌పేట్ నాలా, టూమ్స్ రోడ్డు తదితర ప్రాంతాల్లో కొంత కాలంగా బహుళ అంతస్తుల భవనాలు జోరుగా నిర్మాణంలో ఉన్నాయి. కాగా బహుళ నిర్మాణానికి వాహనాలు అవసరమైన నిర్మాణ సామగ్రిని తెచ్చేందుకు బిల్డర్లు ఫుట్‌పాత్‌లను తవ్వేస్తున్నారు. ఈ విధంగా తవ్వేసిన ఫుట్‌పాత్‌లను రోడ్డుగా మలుచుకుని బిల్డర్లు పాదచారులకు ఫుట్‌పాత్‌లను అందుబాటులో ఉంచడం లేదు. తవ్వేసిన ఫుట్‌పాత్‌ల వద్ద దర్జాగా తమ సెక్యూరిటీ గార్డుల కోసం డబ్బాలు కూడా ఏర్పాటు చేస్తున్నారు.

ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను నిరోధించేందుకు 'రోప్'

పాతముంబై జాతీయ రహదారిపై ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను నిరోధించేందుకు పోలీసులు 'రోప్' కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్వయంగా పోలీసు నగర కొత్వాల్ ఈ రోప్‌లో పాల్గొని టోలిచౌకీ నుంచి షేక్‌పేట్ డీమార్ట్ వరకు పాదయాత్ర చేసి రోడ్డు పక్కన ఉన్న ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను తొలగించారు. పాత ముంబాయి జాతీయ రహదారికి ఆనుకొని బహుళ అంతస్తుల భవనాలు నిర్మితమవుతున్నాయి. ఆ ఫుట్‌పాత్‌లు పూర్తిగా తొలగించి మట్టికుప్పలు గుట్టల్లా ఉన్నాయి.

ఫుట్‌పాత్‌లను అందుబాటులోకి తేవాలి



పాదచారుల కోసం వేసిన ఫుట్‌పాత్‌లు కబ్జాలకు గురికాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. అయితే ఎటుచూసిన ఫుట్‌పాత్‌లు కబ్జాదారుల చేతుల్లోనే ఉంటున్నాయి. టోలిచౌకీ, సెవన్ టూంబ్స్ రోడ్, షేక్‌పేట్ తదితర ప్రాంతాల్లో మార్నింగ్ వాకర్స్‌కు ఫుట్‌పాత్‌లు అందుబాటులో ఉండడం లేదు. గత్యంతరం లేక వారు రోడ్డుపైనే వాకింగ్ చేస్తున్నారు. బల్దియా, ట్రాఫిక్ అధికారులు ఫుట్‌పాత్‌లపై కబ్జాలను నిరోధించాలి. – అశోక్‌కుమార్, టోలిచౌకీ

అయితే పోలీసులు ఇటువైపు కన్నెత్తి చూడటం లేదని ఆరోపిస్తున్నారు. తాము ప్రవేశపెట్టిన పథకాలకు పెద్దగా ప్రచారం చేస్తారే తప్ప తరువాత వాటి పైపు కన్నెత్తి చూడరని ప్రజలు పోలీసులపై ఆరోపణలు చేస్తున్నారు.

ఫుట్‌పాత్‌లపైనే భవన నిర్మాణ సామగ్రి..

టోలిచౌకీ, రేతిబౌలి తదితర ప్రాంతాల్లో ఉన్న ఫుట్‌పాత్‌లు సైతం కబ్జాదారుల చేతుల్లో ఉన్నాయి. ఈ ఫుట్‌పాత్‌లను కొందరూ స్థానిక నాయకుల అండదండలతో దర్జాగా కబ్జా చేసి అద్దెలకు ఇస్తున్నారని ఆరోపిస్తున్నారు. టోలిచౌకీ ఇంపీరియల్ హోటల్ ఎదురుగా ఉన్న మెయిన్‌రోడ్డు ఫుట్‌పాత్‌లపై కంకర, ఇసుక, ఇటుక లాంటి సామగ్రిని కుప్పలుగా వేసి అమ్ముతున్నారు. మరికొన్ని ప్రాంతాలలో ఫుట్‌పాత్‌లపై ఫాస్ట్‌ఫుడ్ డబ్బాలు, కబాబ్ సెంటర్లు వెలిశాయి. అ ఫుట్‌పాత్‌లపై జరుగుతున్న కబ్జాలను బల్దియా, ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవడం లేదు. ట్రాఫిక్ వారు తూతూమంత్రంగా అప్పుడప్పుడు ఫుట్‌పాత్ వ్యాపారులకు చలానాలు వేసి తమ కోటాను పూర్తి చేసుకుంటున్నారని మార్నింగ్ వాకర్స్ ఆరోపిస్తున్నారు. ఏదేమైనా ఫుట్‌పాత్‌లను ప్రజలకు అందుబాటులో ఉంచాల్సిందేనని పలువురు అంటున్నారు.

పశ్చిమబెంగాల్‌లో హిందువులను కాపాడాలి..



మమతా బెనర్జీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

చార్మినార్: పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో హిందువులపై జరుగుతున్న దాడులను అరికట్టాల్సిన అవసరం ఉందని బీజేపీ గోల్కొండ జిల్లా అధ్యక్షులు టి ఉమామహేంద్ర అన్నారు. ఉద్దేశపూర్వకంగా జరుగుతున్న దాడులను తిప్పికొట్టాల్సిన అవసరం ఉందన్నారు. పశ్చిమ బెంగాల్‌లో హిందువులపై మారణహోమానికి వ్యతిరేకంగా బుధవారం పురానాపూల్ క్రాస్ రోడ్ వద్ద పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ దిష్టిబొమ్మను దహనం చేశారు. అంతకుముందు పురాణపూల్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు బల్బీర్ సింగ్ ఆధ్వర్యంలో సేవ్ హిందూస్ అంటూ ప్ల కార్డులతో పురాణాపూల్ ఏరియా ఆసుపత్రి నుంచి చౌరస్తా వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా టి. ఉమా మహేంద్ర మాట్లాడుతూ.. వక్ఫ్ చట్టం పేరుతో పశ్చిమ బెంగాల్ లో మారణ హోమం సృష్టిస్తున్నారని.. దీనిని అరికట్టలేని సీఎం వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నగరంలో ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ కూడా ముస్లింలను రెచ్చగొట్టే విధంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఈనెల 19న మజ్లీస్ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన సమావేశాన్ని అడ్డుకుంటామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సురేందర్, నరేందర్, టి కునాల్ రావు, ప్రకాష్ గౌడ్, ఠాకూర్, రంజిత్ సింగ్, జగదీష్ యాదవ్, శివ యాదవ్, రాజేష్, నటరాజ్ నామ్‌ధారి, రాహుల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్లలో అత్యుత్తమ ప్రమాణాలు



విద్యార్థులకు జ్ఞాపికలు అందజేస్తున్న మిత్ర కృష్ణ

లంగర్‌హౌస్: తెలంగాణలోని సంక్షేమ వసతి గృహాలు అత్యున్నత ప్రమాణాలతో కొనసాగుతున్నాయని కాంగ్రెస్ సీనియర్ నాయకులు మిత్ర కృష్ణ అన్నారు. బుధవారం ఆయన లంగర్‌హౌస్, బాపూనగర్‌ని ప్రభుత్వ బాలుర హాస్టల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అనంతరం హాస్టల్ విద్యార్థులకు జ్ఞాపికలు అందించారు. ఆయన మాట్లాడుతూ వసతి గృహ విద్యార్థులతో కలిసి భోజనం చేయడం తనకు ఆనందంగా ఉందన్నారు. కేవలం రాజకీయాల కోసమే కొందరు ప్రకటనలు చేస్తు ఉంటారని అయితే తనకు సంక్షేమ గృహాల నిర్వహణపై పూర్తిగా తెలుసునన్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనంలో వడ్డిస్తున్న ఆహార పదార్థాలను వార్డెన్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట విజయ్‌ముదిరాజ్, ఉమేష్ కుమార్, రాంచందర్ ఉన్నారు.

ఘనంగా బిరుదురాజు రామరాజు శత జయంతి



బిరుదురాజు రామరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నిత్యానందరావు, ఉదయవర్లు

నాంపల్లి: సాహిత్య అకాడమీ, శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయం హైదరాబాద్ సంస్థల సంయుక్త నిర్వహణలో బిరుదురాజు రామరాజు శత జయంతి వేడుకలు బుధవారం నాంపల్లిలోని తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో ఘనంగా జరిగాయి. సాహిత్య అకాడమీ తెలుగు సలహా మండలి సంచాలకురాలు ఆచార్య సి.మృణాళిని స్వాగతోపన్యాసంతో వేడుకలు ప్రారంభమయ్యాయి. అనంతరం శ్రీ కృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయం గౌరవ కార్యదర్శి టి.ఉదయవర్లు అధ్యక్షతన జరిగిన సదస్సుకు ముఖ్య అతిథిగా తెలుగు వర్సిటీ ఉపాధ్యక్షులు ఆచార్య వెలుదండ నిత్యానందరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా బిరుదురాజు రామరాజు శత జయంతి స్మారక సంచికను ఆవిష్కరించి ప్రసంగించారు. కార్యక్రమంలో ప్రముఖ కవి అమ్మంగి వేణుగోపాల్, కె.లీలావతి, పాకనాటి జ్యోతి, కంచి విజయలక్ష్మి, సీహెచ్.లక్ష్మణ్ చక్రవర్తి, కె.విద్యావతి, ఆచార్య టి.గౌరీ శంకర్, సంగిశెట్టి శ్రీనివాస్, సాగి కమలాకర శర్మ, కాంచనపల్లి గోవర్ధన్ రాజు, తిరునగరి దేవకీదేవి, రంగాచార్య, పద్మ పాల్గొన్నారు. బిరుదురాజు రామరాజు తెలుగు భాషాభివృద్ధికి చేసిన సేవలను వారు కొనియాడారు.

సందేశాత్మక చిత్రాలు రావాలి



మాట్లాడుతున్న రాళ్లబండి వెంకట సుబ్రమణ్యం

గన్‌ఫౌండ్రీ: ప్రస్తుత సమాజంలో సందేశాత్మక చిత్రాలను ఆదరించాల్సిన అవసరం ఉందని ప్రముఖ దర్శక నిర్మాత రాళ్లబండి వెంకట సుబ్రమణ్యం అన్నారు. బుధవారం పైడి జయరాజు థియేటర్‌లో చంద్రుడు క్రియేషన్స్ ఆధ్వర్యంలో రూపొందించిన తీర్పు సినిమా ఆవిష్కరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..... సందేశాత్మక చిత్రాలు రావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రేక్షకులు సైతం కమర్షియల్ చిత్రాలనే కాకుండా సందేశాత్మక చిత్రాలను కూడా ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో యూనిట్ సభ్యులు నర్సింహారావు, సీతారామ చౌదరి, గిడుగు కె.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జానపద సాహిత్యానికి బిరుదురాజు సేవలు ఎనలేనివి

చార్మినార్: తెలుగు జానపద సాహిత్య పరిశోధనకు జీవితాంతం కృషి చేసిన మహనీయుడు ఆచార్య బిరుదురాజు రామ రాజు అని హై కోర్టు పూర్వ రిజిస్ట్రార్ విద్యాధర భట్ అన్నారు. ప్రభుత్వ సిటీ కళాశాల తెలుగుశాఖ, గ్రంథాలయ విభాగం సయుక్త ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన బిరుదు రాజు రామ రాజు జయంతి సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామరాజు పరిశోధకుడు మాత్రమే కాక బాల్యం నుండే గొప్ప పోరాట యోధుడని, గొలిగూడ ప్రాంతంలో సత్యాగ్రహంలో పాల్గొని జైలుకు వెళ్లి వచ్చాడన్నారు. రామరాజు సాహిత్య స్ఫూర్తిని చాటిచెప్పే విధంగా ఒక కార్యశాల ఏర్పాటు చేయాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాల భాస్కర్ మాట్లాడుతూ తెలుగు జానపద సాహిత్య పరిశోధనకు రామరాజు తల్లి వేరు లాంటి వారన్నారు. మౌఖిక సాహిత్య పరిరక్షణకు వా/మ్గయ ఉద్ధరణకు రామరాజు తన జీవితాన్ని ధారపోశారని కొనియాడారు. గ్రామీణ ప్రజా సాహిత్యానికి విస్తృతమైన ప్రచారం కల్పించాల్సిన అవసరముందన్నారు. కళాశాల ఐక్యూయేసి కో –ఆర్డినేటర్ డా.జె.నీరజ మాట్లాడుతూ బిరుదురాజు రామ రాజు సి.నారాయణ రెడ్డి ఇద్దరూ కలిసి కవిత్వం రాశారని, ఆయన మంచి కవి కూడా అని గుర్తు చేశారు. సభకు తెలుగు శాఖ అధ్యక్షులు డా.కోయి కోటేశ్వర రావు అధ్యక్షత వహించగా తెలుగు ఆచార్యులు డా.కాకునూరి సూర్య నారాయణ మూర్తి, అవధానం సుజాత, గ్రంథాలయ అధికారి డా.చేగోని రవి కుమార్, డా. కమల సుధారాణి, డా. సుజాత అజ్మీరా, కేతరీన, డా. అనసూయ ప్రసన్న లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

వైద్య రంగంలో ఫిజియోథెరపీ పాత్ర కీలకం



డాక్టర్ వైఎస్ఎన్ మూర్తిని సన్మానిస్తున్న ఛాయానంది తదితరులు

గన్‌ఫౌండ్రీ: వైద్య రంగంలో ఫిజియోథెరపీ పాత్ర చాలా కీలకమని డీడీహెచ్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ వైఎస్ఎన్.మూర్తి అన్నారు. బుధవారం రవీంద్రభారతిలో దుర్గాభాయి దేశ్‌ముఖ్ ఫిజియోథెరపీ కళాశాల ఆధ్వర్యంలో 3వ జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...... ఫిజియోథెరపీ పై సదస్సు నిర్వహించడం అభినందనీయమని రాబోయే రోజుల్లో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. గైనకాలజీ విభాగంలో ఫిజియోథెరపీ పాత్రను ప్రముఖ వైద్యురాలు డాక్టర్ మంజులరావు వివరించారు. కార్యక్రమంలో సంస్కార ఎన్జీఓ అధ్యక్షురాలు ప్రొఫెసర్ జోత్స్నా, విశ్రాంత ఐఏఎస్ అధికారి ఐవిఆర్.కృష్ణారావు, కళాశాల ఉపాధ్యక్షురాలు కె.లక్ష్మీసుందరి, ప్రిన్సిపాల్ ఛాయానందిని తదితరులు పాల్గొన్నారు.

యాదవ సంఘం అభివృద్ధికి కృషి చేయాలి



నియామక పత్రాలు అందజేస్తున్న వెంకటేష్ యాదవ్

అఫ్జల్‌గంజ్: యాదవ సంఘం నాయకులు సంఘం అభివృద్ధికి కృషి చేయాలని, యాదవుల ఐక్యత, రాజ్యాధికారంలో తమ వాటా, అభివృద్ధి తదితర అంశాలపై సమగ్రంగా చర్చించాలని గ్రేటర్ హైదరాబాద్ యాదవ సంఘం అధ్యక్షులు బోయిని వెంకటేష్ యాదవ్ అన్నారు. బుధవారం బేగంబజార్‌లోని యాదవ సంఘం కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ లోని 19 నియోజకవర్గాల కన్వీనర్‌లకు నియామకపత్రాలను అందజేశారు.

పాతబస్తీలో ప్రధాని దిష్టిబొమ్మ దహనం



లాల్ దర్వాజా మోడ్ వద్ద ప్రధాని దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

చార్మినార్: రాజకీయ దురుద్దేశంతోనే సోనియా, రాహుల్ గాంధీలపై ఈడీ కేసులు నమోదు చేసి రాజకీయ లబ్ధి పొందాలని బీజేపీ చూస్తోందని కాంగ్రెస్ పార్టీ పాతబస్తీ సీనియర్ నాయకులు అన్నారు. గాంధీ కుటుంబం పై ఈడీ కేసుల నమోదును వ్యతిరేకిస్తూ చార్మినార్, చాంద్రాయణగుట్ట, బహదూర్ పురా, యాకుత్ పురా నియోజకవర్గాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జిలతో పాటు పలువురు సీనియర్ నాయకులు లాల్ దర్వాజా మోడ్ నిరసన తెలిపారు. సత్యమేవ జయతే అనే ప్ల కార్డులను చేతుల్లో పట్టుకుని ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. అంతకు ముందు పార్టీ అధిష్టానం పిలుపు మేరకు శాలిబండ లోని పోస్ట్ ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బహదూర్‌పురా నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ పులిపాటి రాజేష్ కుమార్ మాట్లాడుతూ సోనియా గాంధీ, రాహుల్ గాంధీ లపై అక్రమ కేసులు బనాయించడం దారుణమన్నారు. వీటిని వెంటనే ఉపసంహరించు కోకపోతే పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామన్నారు. కార్యక్రమంలో వలీఉల్లా, ముజీబ్ ఉల్లా షరీఫ్, కె.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

20న కోట మైసమ్మ ఆలయ వార్షికోత్సవం

రాజేంద్రనగర్: బుద్వేల్‌లోని చరిత్రాత్మకమైన కోట మైసమ్మ దేవాలయ పునర్నిర్మాణం అనంతరం మొదటి వార్షికోత్సవాన్ని ఈ నెల 20వ తేదీన నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. అలయ ఆవరణలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వార్షికోత్సవ వివరాలను వెల్లడించారు. సంవత్సరం క్రితం బుద్వేల్ కోట మైసమ్మ దేవాలయాన్ని పునర్నిర్మించి అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించామన్నారు. ఎంతో మహిమ గల ఈ దేవాలయాన్ని పునర్నిర్మాణంలో బుద్వేల్ గ్రామ ప్రజలతో పాటు దాతలు తమ సహాయ సహకారాలు అందించారన్నారు. దేవాలయ పునర్నిర్మాణం అనంతరం మొదటి వార్షికోత్సవాన్ని ఈ నెల 20న నిర్వహించనున్నట్లు వివరించారు. వార్షికోత్సవం సందర్భంగా రాజమహేంద్రవరం దేవిచౌక్ చెందిన లీలా కృష్ణ మోహన్ తన తల్లిదండ్రులు పేరిట మూడు తులాల బంగారు ఆభరణాలను అమ్మవారికి చేయించారని వెల్లడించారు. కృష్ణమోహన్ ఆధ్వర్యంలోని అన్నదాన కార్యక్రమం జరగనుందన్నారు. రేవపల్లి రాజు శర్మ, సందీప్ శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వివరించారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి



సమావేశంలో పాల్గొన్న డిప్యూటీ ఈఓ పోమ్యనాయక్, విద్యార్థులు

యాకుత్‌పురా: ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తూ పాఠశాలల విద్యార్థులకు అనేక సదుపాయాలు కల్పిస్తుందని విద్యాశాఖ బహదూర్‌పురా మండల డిప్యూటీ ఈఓ పోమ్యనాయక్ అన్నారు. దారుషిఫా ప్రభుత్వ ప్రత్యేక అంధుల పాఠశాలలో బుదవారం నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅ థితిగా హాజరైన ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు చదువును ఇష్టంగా మార్చుకుని మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి ఉచిత విద్యా, ఇతర సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంధ విద్యార్థులకు ఎలాంటి సమస్యలు రాకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామ్మోహన్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మండడి వెంకట్ రెడ్డి, ఉపాధ్యాయలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలను అణగదొక్కేందుకే వక్ఫ్ సవరణ బిల్లు



మాట్లాడుతున్న కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహియుద్దీన్

గోల్కొండ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ముస్లింలను అణగదొక్కేందుకే వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు తెచ్చిందని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహియుద్దీన్ అన్నారు. ఈ నెల 19న మజ్లిస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న నిరసన సభను విజయవంతం కోసం బుధవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వక్ఫ్ సవరణ–2025ను ముస్లిం వ్యతిరేక చట్టంగా అభివర్ణించారు. ప్రధాని మోదీ కేంద్రంలో ఆర్ఎస్ఎస్ చేతుల్లో కీలుబొమ్మలా మారి ఆర్ఎస్ఎస్ ఏజెండాను అమలు చేస్తున్నారని ఆరోపించారు. ముస్లిం పర్సనల్ లాలో జోక్యం చేసుకుంటూ కేంద్ర ప్రభుత్వం దానిని నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నం కుట్రలు చేస్తుందన్నారు. ఇందులో భాగంగానే కశ్మీర్, ముస్లిం విడాకుల చట్టంలో జోక్యం చేసుకుందన్నారు. భారత సార్వభౌమత్వానికి బీజేపీ తూట్లు పొడుస్తుందన్నారు. భారత రాజ్యాంగాన్ని మోదీ ఖాతరు చేయడం లేదన్నారు. దేశంలోని మైనార్టీ వర్గాల ప్రజలతో పాటు దళితులు, వెనుకబడిన జాతులకు బీజేపీ ప్రభుత్వం వ్యతిరేకంగా పని చేస్తుందన్నారు. దళితులు, ముస్లింలపై బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దాడులు జరుగుతున్నాయని మణిపూర్ దీనికి ఉదాహరణగా పేర్కొన్నారు. భారతదేశంలోని ముస్లింలు వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారన్నారు. బీజేపీ విధానాలను వ్యతిరేకిస్తూ మజ్లీస్ ఆధ్వర్యంలో ఈ నెల 19న దారుసలామ్‌లో జరిగే బహిరంగ సభ ద్వారా దేశానికి, ముఖ్యంగా ప్రధాని నరేంద్రమోదీ తమ గొంతుకను వినిపిస్తామన్నారు. ఇందులో భాగంగానే తాము ముస్లీం మేధావులతో కలిసి ఇంటింటికి తిరిగి వక్ఫ్ బోర్డు సవరణను ప్రజలకు వివరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మహ్మద్‌నసీరుద్దీన్, మజ్లీస్ నాయకులు హారూన్‌ఫరాన్, అజీజ్‌ఖాన్ పటాన్, హబీబ్ చౌష్, వజీఉజ్ జమా, సయ్యద్ అజామ్ తదితరులున్నారు.

యువత ఉద్యోగాల కల్పన దిశగా కృషి చేయాలి



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ జి. నరేష్ రెడ్డి

చార్మినార్: యువత ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా తామే పారిశ్రామిక వేత్తలుగా మారి. తమతో పాటు ఇతరులకు ఉద్యోగాలను కల్పించే దిశగా కృషి చేయాలని ఉస్మానియా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య జి. నరేశ్ రెడ్డి అన్నారు. ప్రభుత్వ సిటీ కాలేజీ, కామర్స్, మేనేజ్మెంట్ విభాగం ఆధ్వర్యంలో 'తెలంగాణ పర్యాటక రంగం – వ్యాపార అవకాశాలు, సవాళ్లు' అనే రెండు రోజుల జాతీయ సదస్సు ప్రారంభ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోవిడ్ ప్రభావంతో తీవ్ర నష్టాన్ని చవిచూసిన పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసి, పెట్టుబడులను ఆకర్షించి ఉద్యోగ అవకాశాలను విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. టూరిజం పాలసీ 2025–30 ద్వారా రూ.15,000 కోట్ల పెట్టుబడులు, మూడు లక్షల ఉద్యోగ అవకాశాలను సృష్టించడమే లక్ష్యంగా పని చేస్తున్నదన్నారు. యువతకు తగిన నైపుణ్యాలు అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడం ముందడుగా పేర్కొన్నారు. ఉస్మానియా వర్సిటీ సీనియర్ ఆచార్యులు చెన్నప్ప మాట్లాడుతూ.. దేశంలో అత్యుత్తమ న్యాక్ గ్రేడ్ సాధించిన సిటీ కాలేజీని అభినందించారు. తెలంగాణలో అనేక ఆధ్యాత్మిక, చారిత్రక పర్యాటక కేంద్రాలు ఉన్నాయని వాటిని పరిరక్షించాల్సిన అవసర ముందన్నారు. భారతీయ రైల్వే ఆహార సరఫరా, పర్యటక సంస్థ జీఎం కిశోర్ మాట్లాడుతూ, రైల్వే పర్యటక రంగంలో నైపుణ్యం కలిగిన యువతకు అనేక ఉద్యోగ అవకాశాలున్నాయన్నారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ ఆచార్యులు డా. యలమంచిలి రామకృష్ణ మాట్లాడుతూ, పర్యటక రంగం ద్వారా ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు ఆర్థికాభివృద్ధిని సాధిస్తున్నాయన్నారు. కళాశాల ఐక్యూఏసీ సమన్వయకర్త డా. జె. నీరజ మాట్లాడుతూ, హైదరాబాద్ భౌగోళికంగా అత్యుత్తమ ప్రదేశం కావడంతోపాటు, చారిత్రక కట్టడాలు, వంటకాల వంటి అనేక అంశాల కారణంగా పర్యటకులను ఆకర్షిస్తున్నదన్నారు. సదస్సుకు అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ ఆచార్య పి. బాల భాస్కర్ మాట్లాడుతూ, పర్యటక రంగ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించేలా సిలబస్ రూపొందించామన్నారు. కార్యక్రమంలో కామర్స్ మేనేజ్మెంట్ విభాగం అధ్యక్షులు డా.కె.మల్లికార్జున రావు, కన్వీనర్ డా.ఝాన్సీ రాణి, డా. ఇఫత్ ఉన్నీసా, డా. రవీంద్రబాబు, డా. శిరీష, లలిత చైతన్య, సైదులు, కావ్య, అరుణ, నరేశ్, ఫ్లోరెన్స్, త్రిశూల్, రామారావు, విద్యార్థులు పాల్గొన్నారు.